హక్కుల సాధనకు కలిసి ఉద్యమిద్దాం

● వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వడ్డెరల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించి సాధించుకుందామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యుజన విభాగం అధ్యక్షులుగా పల్లవు శ్రీకాంత్‌కు నియామకపత్రాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో ఆయన సంఘం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు వేముల తిరుమలదేవితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం సభ్యులకు కాంగ్రెస్ యువ నాయకులు నవీన్‌యాదవ్ ఇస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ ముదిరాజ్, నగేష్, పార్వతి, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.


అమీర్‌పేట కమ్మ సంఘం భవనంలో సమావేశమైన సంఘం ప్రతినిధులు

కమ్మ సేవా సంఘాల సమాఖ్య సమావేశం

అమీర్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట కమ్మ సంఘం ఆవరణలో ఆదివారం కమ్మ సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం చలసాని వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర సంఘంపై వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన సందర్భంగా రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా సభ్యుల రివ్యూ కమిటీని ఐదుగురితో ఏర్పాటు చేశారు. ఇందులో పొట్లూరి పాండురంగారావు, డాక్టర్ పునుకొల్లు నాగభూషణం, చాపరాల శ్రీనివాస దాసు, తాళ్లూరి జీవన్‌కుమార్, పల్లెంపాటి శివన్నారాయణ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ తెలంగాణలో ఉన్న 53 కమ్మ సంఘాల వారితో మాట్లాడి రాష్ట్ర కమిటీకి నివేదిక అందజేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కమ్మ సేవా సంఘాల సమాఖ్య, గౌరవ అధ్యక్షులు సీవీ రావు, అధ్యక్షులు ఆరికెపూడి గాంధీ, ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి వెంకటేశ్వర్ రావు, పునుకొల్లు నాగభూషణం, తాళ్లూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంసీ మృతి


సుధీర్‌చంద్ర(ఫైల్)

ఖైరతాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సుధీర్‌చంద్ర (42) మృతిచెందారు. బరువు తగ్గించుకునేందుకు ఆయన బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో చేరగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారు. ఏడాదిన్నర క్రితం ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంసీగా బాధ్యతల్లో ఉన్న సుధీర్‌చంద్ర రెండు నెలల నుంచి సిక్ లీవ్‌లో ఉన్నారు. పెద్ద మొత్తంలో వైద్య చికిత్స కోసం ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోగా చివరకు ప్రాణాలు పోయాయని సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, మూడున్నర సంవత్సరాల పాప, 11 నెలల బాబు ఉన్నట్లు ఉద్యోగులు తెలిపారు. సర్కిల్ 17 ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డితో పాటు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు మూసారాంబాగ్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళ అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14 వెంకటేశ్వరనగర్ కాలనీలో కొద్ది కాలంగా అర్ధరాత్రి తరువాత మద్యం అమ్మకాలు సాగుతున్నాయని బంజారాహిల్స్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే ఆయన తన సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఓ మహిళ మద్యం అమ్ముతూ పట్టుబడింది. ఆమె సిరుక్మిణిగా పోలీసులు గుర్తించారు. ఆమె వద్ద ఉన్న 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌పై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో ఓఆర్ఆర్ టోల్‌లీజ్ అక్రమాలపై విచారణ జరిపించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ లీజులో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని.. ఇందులో కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7,380 కోట్ల రూపాయలకు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు 30 ఏళ్లకు లీజ్‌కు ఇచ్చిందని, దీనికి బదులుగా ఆ సంస్థ బీఆర్‌ఎస్‌కు రూ.25 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిందని ఆరోపించారు. దీంతో పాటు కేటీఆర్‌కు కొంత డబ్బు ముట్టిందని ఆయన అన్నారు. వీటిపై ఏసీబీ, ఈడీతో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అక్రమాలపై వెంటనే స్పందించి పూర్తి విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రగతినగర్, ఈసేవ ఫీడర్ల పరిధిలోని బ్రైట్ స్కూల్, ఎల్‌ఐసీ కాలనీ, ఉషాకాలనీ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కృష్ణానగర్ సి-బ్లాక్, అరోరా కాలనీ ఫీడర్ల పరిధిలోని సి-బ్లాక్ ప్రాంతం, బాలాజీ అపార్టుమెంట్, అరోరా కాలనీ, పెట్రోల్ పంప్, బంజారాహిల్స్ రోడ్ నంబర్-3 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎర్రగడ్డ, మోతిలాల్ నగర్, బేగంపేట చికోటి గార్డెన్ ఫీడర్ల పరిధిలోని బీఎస్‌పురి కాలనీ, సుల్తాన్ నగర్, శంకర్‌లాల్ నగర్, నటరాజ్ నగర్, నేతాజీ నగర్, పేస్ ఆసుపత్రి, గురుమూర్తి లైన్, మోతిలాల్ నగర్, నెహ్రూనగర్, ఎయిర్ కార్గో, శ్యామల కుంట ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఎయిర్‌పోర్ట్ హ్యాంగర్స్, శ్రీరామ్ నగర్ ఫీడర్ల పరిధిలోని ఐసీఐసీఐ బ్యాంక్ లైన్, భగవత్‌పూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ, రాజీవ్ నగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

పార్కు నిర్వహణ పట్టదా..?

● చెత్తాచెదారంతో నిండిపోయిన శ్రీరామ్‌నగర్ పార్కు
● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్న పోకిరీలు
● అధికారులు దృష్టి సారించి సుందరీకరించాలని కోరుతున్న స్థానికులు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పంచుతూ ఆహ్లాదాన్ని అందిస్తూ పిల్లల ఆటలకు, పెద్దల వాకింగ్‌కు అనువుగా ఉండాల్సిన రహ్మత్‌నగర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ పార్కు అస్తవ్యస్తంగా మారిపోయింది. పార్కు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కూర్చునేందుకు వేసిన బెంచీలు విరిగిపోయాయి. సమీపంలో నివసించే వారికి ఇది స్టోర్‌రూమ్‌లా మారింది. పాడైన వస్తువులను తీసుకొచ్చి ఇక్కడ వేస్తున్నారు. పోకిరీలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.


కూలిపోయిన పార్కు ప్రహరీ

నిర్వహణ సరిగా లేకపోవడంతోనే..

గ్రీన్‌బెల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మోతీనగర్ కూడలి, కల్యాణ్‌నగర్ వెంచర్-3, శ్రీరామ్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయం వరకు రహదారి మధ్యలో దశాబ్దం క్రితం పార్కు ఏర్పాటు చేశారు. కల్యాణ్‌నగర్ పార్కులో పిల్లలు ఆడుకునే పరికరాలు, వాకర్స్‌కు అనువుగా ఏర్పాట్లు, గ్రంథాలయం, సమావేశ మందిరాలు ఉన్నాయి. అయితే శ్రీరామ్‌నగర్ పరిధిలో ఉన్న పార్కు మాత్రం చెత్తకు నిలయంగా మారింది. సందర్శకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు విరిగిపోయాయి. ప్రహరీ కూలిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవటంతో కొంత మంది తమ వ్యాపార సామగ్రిని ఇక్కడ పెట్టి స్టోర్‌రూమ్‌లా వాడుకుంటున్నారు. ఇక పోకిరీలు పట్టపగలే చేరి గంజాయి, సిగరెట్లు, మందు తాగేందుకు అడ్డాగా మార్చేశారు. దీంతో ఈ పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళ కాసేపు సేదతీరేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి తలెత్తిందని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి పార్కును సుందరీకరించి ఆహ్లాదకరంగా తయారుచేయాలని కోరుతున్నారు. తమకు అందుబాటులో ఉన్న ఏకైక పార్కు కావడంతో దీని నిర్వహణపై దృష్టి సారిస్తే బాగుంటుందని స్థానికులు చెబుతున్నారు.


విరిగిపోయిన బెంచీలు


పార్కులో స్థానికులు పడేసిన సింటెక్స్ ట్యాంక్‌లు


పార్కులో ఉన్న చెత్తకుప్పలు

ప్రశ్నించే తత్వంతోనే బీసీలకు రాజ్యాధికారం

● శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి


సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

పంజాగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కులగణనకు ఎన్నో ఆటంకాలు సృష్టించిన ప్రభుత్వాలు ఇంతవరకు బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఎందుకు ఏర్పాటు చేయలేదని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. బుడబుక్కల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి.విఠల్ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయిలో చైతన్యవంతంగా ఉన్నప్పుడే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని, ప్రశ్నించి ఎదిరించినప్పుడే అది సాధ్యమన్నారు. చట్టసభల్లో ఇప్పటికీ చాలా బీసీ కులాలకు ప్రాతినిధ్యం లేదని, ఉన్న కొన్ని కులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. తమిళనాడులో సీట్లు అడిగే స్థాయి నుంచి సీట్లు ఇచ్చే స్థాయికి బీసీ నాయకత్వం ఎదిగిందన్నారు. తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కనీసం జిల్లా సరిహద్దులు దాటని కులాలను హైదరాబాద్ తీసుకొచ్చి అసెంబ్లీ తదితర ప్రాంతాలను చూపించానని ఆయన గుర్తు చేశారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

● తెలంగాణ సిక్ యూత్ అసోసియేషన్ విజ్ఞప్తి


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, శ్రీనివాస్ రెడ్డి

పంజాగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని, దేశ ప్రగతికి బాటలు వేసిన ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని తెలంగాణ సిక్ యూత్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జూరావర్ సింగ్, న్యాయవాది పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. భారతరత్న ఇవ్వడంతో పాటు దేశ రాజధానిలో ఆయన పేరుతో సింగ్ ఘాట్ ఏర్పాటు చేయాలని, జాతీయస్థాయిలో ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని,ఒక విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

అక్షరాస్యత వ్యాప్తికి వెంకట రామారెడ్డి కృషి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ అంతటా అక్షరాస్యతను వ్యాప్తి చేయాలనే సంకల్పంతో అనేక విద్యా సంస్థలకు ప్రాణం పోశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని మీట్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. వెంకట రామారెడ్డి 22 విద్యా సంస్థలను స్థాపించి తన చివరి రోజుల వరకు వాటికి అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. దూరదృష్టి, అంకితభావం కలిగిన సంఘ సంస్కర్త వెంకట రామారెడ్డి అని, ఆయన మహిళల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ప్రముఖులను తయారు చేసిన ఘనత రెడ్డి హాస్టల్‌కు ఉందన్నారు. రెడ్డి హాస్టల్‌లో ఉన్న ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఇదంతా కేవలం ఒక్క వ్యక్తివల్లే సాధ్యమైందన్నారు. ఆయనే మన రాజా బహద్దూర్ వెంకట రామా రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని రాయన్నిపేట గ్రామంలో జన్మించి కొత్వాల్ స్థాయికి ఎదిగారని.. రెడ్డి అంటే మానవత్వం, సమాజ సేవ, కష్టానికి ప్రతిరూపమని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మధురానగర్ పీఎస్ ఎన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణలో కాలనీ సక్షేమ సమితుల పాత్ర భేష్

● కాలనీ సంక్షేమ సమితులకు ఇన్‌స్పెక్టర్ కితాబు

పంజాగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో కాలనీ సంక్షేమ సమితుల సహకారం మరువలేనిదని మధురానగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ అన్నారు. ఆదివారం వెంగళరావునగర్ సంక్షేమ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమితి 2025 క్యాలెండర్‌ను ఆయన సమితి సలహాదారు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.హెచ్.ఎన్ ప్రసాద్, అర్జున్, ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఏ సమయంలో ఏ సహాయం కావాలన్నా తాము అందుబాటులో ఉంటామని శ్రీనివాస్‌వర్మ హామీ ఇచ్చారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జి.రాజశేఖర్, డి.ధనుంజయరెడ్డి, కె.రాజశేఖర్ గుప్తా, రాహుల్‌దేవ్, సుబ్బారావు, ఎం.బి.ఆర్ ప్రసాద్, సునీత, తిరుమలేష్,ముత్తయ్య, నటరాజ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా

అవసరం లేని వైద్యం మంచిది కాదు

● డాక్టర్ పీసీ గుప్తా

బంజారాహిల్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల సరైన అవగాహన లేని చాలామంది యూట్యూబ్‌లో వీడియోలు చూసి తమకు లేని వ్యాధిని ఉందని నిర్ధారించుకుని అవసరం లేని వైద్యాలు చేయించుకుంటున్నారని వాస్కులర్ సొసైటీ వరల్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ పీసీ గుప్తా అన్నారు. కొండాపూర్‌లో జపాన్ ఇకిగాయ్ సిద్ధాంతాలతో ఏర్పాటు చేసిన డయాబెటిక్ ఫుట్, వాస్కులర్ క్లినిక్‌లో ఆదివారం ఇకిగాయ్ సిద్ధాంతాలతో కూడిన వైద్య పుస్తకాన్ని ఆయన అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్ ఆఫ్ ఇండియా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నితిన్ మోకల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీసీ గుప్తా మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వస్తున్న అనేక వీడియోలు చూస్తూ చాలామంది మోసపోతున్నారని, ఇది మంచిది కాదన్నారు. డాక్టర్ నితిన్ మోకల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో భారతదేశం డయాబెటిక్ హబ్‌గా మారుతుండడం ఆందోళనకరంగా ఉందని, రోజురోజుకు అన్ని వయసుల్లో డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార అలవాట్లను మార్చుకోవడంతో పాటు వ్యాయామంతో డయాబెటిక్ నుంచి కాపాడుకోవచ్చున్నారు.


విజిత జట్టుకు కప్‌తో పాటు నగదు బహుమతి అందజేస్తున్న విజయారెడ్డి

పీజేఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సయ్యద్ సీసీ జట్టు

ఖైరతాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నాయకుడు దివంగత పి.జనార్ధన్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా టీపీసీసీ నాయకురాలు, కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఆగాపురకు చెందిన సయ్యద్ సీసీ జట్టు గెలుచుకుంది. డే అండ్ నైట్‌లుగా జరిగిన మ్యాచ్‌లలో ఫైనల్ పోరు శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. ఈ పోరులో ఆగాపురకు చెందిన సయ్యద్ సీసీ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. ఆ జట్టుకు విన్నర్స్ కప్‌తో పాటు 25 వేల రూపాయల నగదు బహుమతి సొంతం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన ఎంఎస్ మక్తాకు చెందిన ఎన్‌సీసీ జట్టుకు రెండవ బహుమతితో పాటు 10వేల రూపాయల నగదు బహుమతి అందింది. విజేతలకు పీజేఆర్ ట్రస్టు చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి బహుమతులతో పాటు నగదును అందజేశారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


విన్యాసాలు చేస్తున్న గంగిరెద్దులు

సంక్రాంతి సంబురాలు

అమీర్‌పేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్ కాలనీలో కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి మధుసూదనరావు, దండా బుచ్చిబాబు, మైనేని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సమీప కాలనీలు, బస్తీల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ వేడుకల్లో బేగంపేటలోని దేవనార్ దివ్యాంగుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆలపించిన శాస్త్రీయ సంగీత గీతాలు అలరించాయి. చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శన, గంగిరెద్దుల ఆటలు, ముగ్గుల పోటీలు, హరిదాసు కీర్తనలు వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో పల్లె వాతావరణాన్ని పరిచయం చేస్తూ సంక్రాంతి వైభవాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. ప్రముఖులను సన్మానించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇద్దరికి మించి పిల్లలున్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి అవకాశమివ్వాలి

● అభిమాన్ గాంధీనాయక్

పంజాగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్న వారికి పోటీచేసే అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీనాయక్ ధరావత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయకుండా తెచ్చిన 1995 చట్టాన్ని రద్దు చేయాలన్నారు. గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఏపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసిందని, తెలంగాణ ప్రభుత్వం సైతం ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కమిటీ రాష్ట్ర కార్యదర్శి లింగారెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, జి.సదానందం, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానించిన రిసోర్స్ పర్సన్స్

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు ఆర్పీల కృతజ్ఞతలు

మారేడుపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ) ఆదివారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆర్పీలకు సంబంధించిన డిమాండ్ల గురించి వివరించడం శుభపరిణామమన్నారు. తమ సమస్యల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నందుకు ఆయనకు ఆర్పీలు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

సికింద్రాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బొలంరాయి అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. అంబేడ్కర్‌నగర్ ఆల్ఫా ఒమేగా స్కూల్ నుంచి ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు ఉన్న డ్రైనేజీ పైపులు పగిలిపోయి రోడ్డు పైన మురుగునీరు ప్రవహించడమే కాకుండా ఇళ్లలోకి వస్తుందని వివరించారు. రోడ్డుపై నడిచే పరిస్థితి లేదని, దుర్వాసన భరించలేక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. వెంటనే డ్రైనేజీ పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

చంపేస్తామని బెదిరిస్తున్నారు..

అల్లు అర్జున్ ఫ్యాన్స్‌పై ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుల ఫిర్యాదు

తార్నాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ ఫ్యాన్స్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ కొద్దిరోజుల క్రితం అల్లు అర్జున్ ఇంటి వద్ద నిరసన తెలిపిన ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు ఆదివారం ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసినందుకు ఆయనకు వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో తమను చంపేస్తామని ఫ్యాన్స్ నుండి తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు. అల్లు ఆర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో వందల కాల్స్ చేస్తున్నారని, తమ ఫోన్ నెంబర్స్ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ స్పందించి వారి అనుచరుల నుంచి తమకు బెదిరింపు కాల్స్ రాకుండా కట్టడి చేయాలని, లేకుంటే వేలాది మంది విద్యార్థులతో కలిసి అల్లు అర్జున్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొంతం దీపిక

చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

రెజిమెంటల్‌బజార్, డిసెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వ్యాపారం చేసుకునేందుకు ఫుట్‌పాత్ వ్యాపారులకు అవకాశం ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించి వారిలో మార్పు తీసుకరావడానికి ట్రాఫిక్ పోలీసులు సహకరించాలని ట్రాఫిక్ ఏసీపీని కోరినట్లు మోండా కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వీధి వ్యాపారులను అడ్డుకుంటున్నారని ఫుట్‌పాత్ వ్యాపారులు కార్పొరేటర్‌కు తెలిపారు. దీంతో ఆదివారం వారిని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులను అడ్డుకోవద్దని ట్రాఫిక్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని మేయర్, సీపీల దృష్టికి తీసుకెళ్తానని కార్పొరేటర్ తెలిపారు.



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని లాలాపేట్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ప్రతినిధి రాఘవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్, సామల వేణు, మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్, అధ్యక్షుడు చిలుక శ్రీనివాసులు, మీసాల శ్రీనివాస్, కొండమడుగు నాగరాజు, చింతల కృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి



మహేంద్రహిల్స్‌లో ఆదివారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కంటోన్మెంట్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించిన కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ. - మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



సికింద్రాబాద్ లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ జనరల్‌బాడీ సమావేశంలో పాల్గొన్న అధ్యక్షులు పాలూరి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు (బాబు), కోశాధికారి గోవింద్‌రాజులను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు. - బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



మెట్టుగూడ డివిజన్ సెక్రేడ్ హార్ట్ చర్చిలో ఆదివారం నిర్వహించిన క్రిస్మస్ ఫీస్ట్‌లో పాల్గొన్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీతను సత్కరించిన చర్చి ప్రతినిధులు. - చిలకలగూడ, ఆంధ్రజ్యోతి


'పది' విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్

- ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్న విద్యాశాఖ
- ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనే దానిపై పర్యవేక్షణ
- తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తున్న ఉపాధ్యాయులు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక ఫోకస్ చేసింది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా పోటీ పడేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. 10కి 10 పాయింట్లు సాధించడమే లక్ష్యంగా అక్టోబరు నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా.. డిసెంబర్ నుంచి ఇంటి వద్ద ఎలా చదువుతున్నారనే దానిపై సైతం ఫోకస్ చేశారు. జనవరి నుంచి తెల్లవారుజామునే లేచి చదువుకునేలా ప్రణాళికలు రూపొందించారు. వారంలో ఒకటి రెండు సార్లు తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులు ఇంట్లో చదువుతున్న తీరును తెలుసుకుంటున్నారు. దీనివల్ల తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు..

ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కోరోజు ఒక్కో సబ్జెక్ట్‌పై రివిజన్ చేయిస్తున్నారు. ఆయా సబ్జెక్టులలో వీక్‌గా ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.



డిజిటల్ విధానంలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత..

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల అనేక పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులను కేటాయించినప్పటికీ సికింద్రాబాద్ ప్రాంతంలో ఉన్న ఏకైక ఉర్దూ మీడియం స్కూల్‌లో కొన్ని సంవత్సరాలుగా ఉర్దూ టీచర్ లేరు.

విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు



పాఠశాలలో ఉర్దూ, గణితం ఉపాధ్యాయులు లేరు. అయినప్పటికీ 100% ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రైవేట్ టీచర్లను నియమించి విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- జయచందర్, ప్రధానోపాధ్యాయుడు, నల్లగుట్ట ఉర్దూ మీడియం స్కూల్

శీలం నాగేశ్వరరావుకు ఓయూ డాక్టరేట్

తార్నాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలానికి చెందిన శీలం నాగేశ్వరరావు ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. ఓయూలోని కామర్స్ విభాగంలో ప్రొ. కె.వి. అచలపతి పర్యవేక్షణలో 'సోషల్ సెక్యూరిటీ ఫర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్. ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను ఓయూ అధికారులు డాక్టరేట్‌ను పొందినట్లు ఆదివారం ఆయన తెలిపారు. పరిశోధన పూర్తిచేసేందుకు తనకు సహకరించిన ప్రొఫెసర్లకు, తోటి పరిశోధనా విద్యార్థులకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఓఆర్ఆర్ టోల్‌లీజ్‌పై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఓఆర్ఆర్ టోల్‌లీజ్ అక్రమాలపై విచారణ జరిపించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ లీజులో కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగిందని.. ఇందులో కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7,380 కోట్ల రూపాయలకు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థకు 30 ఏళ్లకు లీజ్‌కు ఇచ్చిందని, దీనికి బదులుగా ఆ సంస్థ బీఆర్ఎస్‌కు రూ.25 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిందని ఆరోపించారు. దీంతో పాటు కేటీఆర్‌కు కొంత డబ్బు ముట్టిందని ఆయన అన్నారు. వీటిపై ఏసీబీ, ఈడీతో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాలు



పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న కుల సంఘం నాయకులు

బౌద్ధనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంజీవపురం పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాలను ఆదివారం సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు కులసంఘం నాయకులు, పెద్దలు పాల్గొని మాట్లాడారు. పద్మశాలి కులస్థులకు రాజకీయ గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కుల సంఘం సభ్యులను సత్కరించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు హనుమాన్ల బాలరాజు, ప్రధాన కార్యదర్శి తాటికొండ చంద్రశేఖర్, కోశాధికారి ఎస్ఎస్ చక్రధారి, ఉపాధ్యక్షులు ఎలగందుల సత్యనారాయణ, నారా నవీన్‌కుమార్, వనమాల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే అధికారులకు సహకరించండి

- గంట రాజుసాగర్



అడ్డగుట్టలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంట రాజుసాగర్

అడ్డగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడానికి వస్తున్న అధికారులకు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్ సూచించారు ఆదివారం అడ్డగుట్ట డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న ఇళ్లు లేని అర్హులైన దరఖాస్తుదారులకు ప్రభుత్వ అధికారులు ఫోన్ చేసినప్పుడు పూర్తిగా సహకరించాలన్నారు. అధికారులు వచ్చిన సమయంలో లబ్ధిదారులు ఇంటి వద్దనే ఉండాలని ఆయన కోరారు ఈ సర్వే పరిశీలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగుట్ట డివిజన్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయి చందర్‌లతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఫిబ్రవరి 3న 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులు'



న్యూఅశోక్‌నగర్‌లో డప్పులతో ప్రదర్శన చేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు

బౌద్ధనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను జనాభా ప్రాతిపదికన చేయాలని కోరుతూ ఫిబ్రవరి 3వ తేదీన తలపెట్టిన లక్ష డప్పులు- వెయ్యి గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ కోరారు. ఆదివారం న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీహాలులో జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్‌మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీల్లోని అన్నికులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపర్చారన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ చేయాలని మంద కృష్ణమాదిగ రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. దీనిని కొంత మంది అడ్డుకోవటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు బుంజూరి విజయ్‌మాదిగ, ఎంఎస్పీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గణేశ్‌మాదిగ, నాయకులు రుద్రి, సత్యనారాయణ, శివప్రసాద్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

అక్షరాస్యత వ్యాప్తికి వెంకటరామారెడ్డి కృషి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ అంతటా అక్షరాస్యతను వ్యాప్తి చేయాలనే సంకల్పంతో అనేక విద్యా సంస్థలకు ప్రాణం పోశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి హాస్టల్ మొదటి అలూమ్ని మీట్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. వెంకట రామారెడ్డి 22 విద్యా సంస్థలను స్థాపించి తన చివరి రోజుల వరకు వాటికి అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. దూరదృష్టి, అంకితభావం కలిగిన సంఘ సంస్కర్త వెంకట రామారెడ్డి అని, ఆయన మహిళల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకున్నారన్నారు. ప్రముఖులను తయారు చేసిన ఘనత రెడ్డి హాస్టల్‌కు ఉందన్నారు. రెడ్డి హాస్టల్‌లో ఉన్న ఎందరో విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా ఉన్నారని పేర్కొన్నారు. ఇదంతా కేవలం ఒక్క వ్యక్తివల్లే సాధ్యమైందన్నారు. ఆయనే మన రాజా బహద్దూర్ వెంకట రామా రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లాలోని రాయన్నిపేట అనే చిన్న గ్రామంలో జన్మించి కొత్వాల్ స్థాయికి ఎదిగారని.. రెడ్డి అంటే మానవత్వం, సమాజ సేవ, కష్టానికి ప్రతిరూపమని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు.

దళిత టీచర్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసిన అయ్యప్ప భక్తులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం తుకారాంగేట్ లాలాగూడ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న రాములు పాఠాలు బోధిస్తున్న సమయంలో తొమ్మిదోవ తరగతి చదువుతున్న అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థికి కాలు తాకాడన్న సాకుతో అయ్యప్ప భక్తులు కొందరు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిపై దాడి చేసి విద్యార్థి కాలు మొక్కించడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన అయ్యప్ప భక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

బాక్సింగ్ పోటీలో పతకాలు సాధిస్తారు: కోచ్ కృష్ణ



ఉత్తరప్రదేశ్ చాంపియన్‌షిప్ బాక్సింగ్ పోటీలకు సెలెక్ట్ అయిన సికింద్రాబాద్ బాక్సర్లు

అడ్డగుట్ట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో జనవరి 4వ తేదీన జరిగే 8వ ఎలైట్ సీనియర్ జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు సికింద్రాబాద్‌కు చెందిన ఏడుగురు బాక్సర్లు సెలెక్ట్ అయినట్లు కోచర్ కృష్ణ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్‌లో జాతీయ బాక్సింగ్ పోటీలకు గుర్రాల శ్రీకర్, సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న సాయితేజ, శ్రీసాయి చైతన్య కాలేజీలో రెండో సవంత్సరం చదువుతున్న హరీష్, సికింద్రాబాద్ మహబూబ్ డిగ్రీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న సాయిస్వరూప్, ఆకాశ్, నారాయణగూడలోని సీఎంఎస్ డిగ్రీ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్న సాయికిరణ్, మల్లికార్జున్ ఎంపికయ్యారని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగే సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో హైదరాబాద్‌కు మంచి పేరు తెస్తారన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి

- బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు జె.రామకృష్ణ

మారేడుపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు బోర్డు మెంబర్ జె.రామకృష్ణ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డ్ పరిధిలోని శివఅరుణ్ కాలనీ, అశ్వినీనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలు ఉంటే అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం 118 నియోజకవర్గాలే ఉన్నట్లు భావిస్తూ కంటోన్మెంట్‌ను గాలికి ఒదిలేసిందని ఆరోపించారు. కంటోన్మెంట్‌లో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయానంద్, టోపీ శంకర్, రాజమల్లేష్, ప్రేమ్‌కుమార్, బాబూరావు, హరి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ ఇమేజ్ దెబ్బతీసే ప్రయత్నం

- బీఆర్ఎస్ నాయకుడు పాండుయాదవ్



పాండుయాదవ్

బోయిన్‌పల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకే అభివృద్ధి పనికి రెండుసార్లు ప్రారంభోత్సవం చేయడం 6వ వార్డు బీజేపీ నాయకుడు బానుక మల్లికార్జున్ నిర్వాకమని కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్లికార్జున్ ఈటల రాజేందర్ పరువును దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 6వ వార్డులో గత ఆరు నెలల ముందు వేసి ఎప్పుడో ప్రారంభించిన రోడ్డును ఆదివారం మళ్లీ ప్రారంభించారని మండిపడ్డారు. తాను పదవిలో ఉన్నప్పుడు రిటైనింగ్ వాల్‌కు సహాయం అందించానని, నాటి ఉపాధ్యక్షుడి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు

రాజ్యాంగంతోనే మహిళలకు సమానత్వ హక్కు

బౌద్ధనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగం ద్వారానే మహిళలకు సమాన్వత హక్కులు వచ్చాయని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఆదివారం సీతాఫల్‌మండిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆరవ వారం జ్ఞానమాలను వేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ.. తరతరాలుగా స్త్రీలకు విద్య, ఉద్యోగ, సంపద తదితర రంగాల్లో హక్కులు నిరాకరించారన్నారు. భారత రాజ్యాంగం హక్కులు కల్పించడం వలన నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందడగు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గృహకార్మిక సంఘం నగర నాయకురాళ్లు చికోటి సుజాత, శశికళ, కవిత, పరమేశ్వరి, రమ, స్వాతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.